ప్రజాశక్తి

శుక్రవారం 22 డిసెంబర్ 2023

8 పేజీలు





విశాఖపట్నం   అనకాపల్లి



అనకాపల్లిలో ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వేతన తిప్పలు

◆ కష్టాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు
◆ కలగా మిగిలిన క్రమబద్ధీకరణ ◆ ప్రభుత్వ తీరుపై సమ్మెబాట

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేయకపోవడంతో ఉద్యోగులు అనివార్య పరిస్థితుల్లో ఆందోళనలకు దిగుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు, ఎన్నికల హామీలు అమలుచేయాలని ఈ నెల 12 నుంచి అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టగా, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ప్రతి నెలా ఒకటిన జీతాలు చెల్లించాలని సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్-ఎస్ఎ) ఉద్యోగులు డిసెంబరు 20 నుంచి సమ్మెకు దిగారు. 2008 నుంచి వివిధ కేటగిరీల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలో వచ్చిన తరువాత అనేకసార్లు ఎస్ఎస్ఎ ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని సిఎంకు వినతిపత్రాలు ఇచ్చారు. కానీ ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయలేదు సరికదా, ఇతర శాఖల ఉద్యోగులకు అమలు చేసిన 23 శాతం పిఆర్‌సి వీరికి ఇవ్వలేదు. ఎపి మోడల్ స్కూల్‌లో పనిచేసిన ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసిన ప్రభుత్వం ఎస్ఎస్ఎ ఉద్యోగులకు అమలుచేయలేదు. ప్రాజెక్టులు వేర్వేరు అని చెబుతూ హెల్త్ మిషన్, ఎపి మోడల్ స్కూల్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలుచేసి ఎస్ఎస్ఎ ఉద్యోగులకు అన్యాయం చేసింది. మరోవైపు జీతాలు కూడా ప్రతినెలా చెల్లించకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలల జీతాల బకాయిలపై ప్రభుత్వంపై ఒత్తిడితేగా రెండు నెలల జీతం చెల్లించింది. వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అవుట్ సోర్సింగ్ పద్ధతిని రద్దుచేసి ఎస్ఎస్ఎలోని వివిధ కేటగిరీల ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతి కిందకు తీసుకురావాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు యుటిఎఫ్ సహా పలు ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి.

ఎస్ఎస్ఎ పరిధిలోని మండల విద్యాశాఖా కార్యాలయంలో సిఆర్‌ఎంటిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, మండల లెవెల్ అకౌంటెంట్స్, మెసెంజర్స్, సహిత విద్యా రిసోర్స్ పర్సన్స్ భవిత ఆయా, ఫిజియోథెరపిస్టులు. హై స్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఆర్ట్, మిగతా 2లో..

రెగ్యులర్ చేయాలి



ఎస్ఎస్ఎలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. అంతవరకూ మినిమం టైమ్ స్కేల్ సహా హెచ్ఆర్ఎ, డిఎ వర్తింపజేయాలి. ప్రతి నెలా ఒకటిన జీతాలు చెల్లించాలి. ఫీల్డ్ స్టాఫ్‌కు రవాణా ఛార్జీలు చెల్లించాలి. అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ పద్ధతిని రద్దుచేసి ఉద్యోగులందరినీ కాంట్రాక్టు విధానంలోకి తీసుకురావాలి.

బొడ్డేడ అచ్యుతకృష్ణ, సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (జెఎసి) జిల్లా ముఖ్య సలహాదారు

జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ ఎంఒయు

వర్కింగ్ కేపిటల్ కోసమేనని ప్రకటన


ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఊహించినట్టుగానే విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (జేఎస్‌పిఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ గురువారం ఆ అంశాన్ని ధృవీకరిస్తూ జిందాల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం ఆర్‌ఐఎన్ఎల్ చేసుకుందని, ఈ నెల 30న బ్లోయింగ్ - ఇన్ చేసేందుకు ప్లాన్ చేసిన బ్లాస్ట్ ఫర్నేస్ -3ని ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ ఎంఒయు ప్లాంట్‌కి వర్కింగ్ కేపిటల్ సపోర్టు కోసం దోహదపడుతుందని వెల్లడించారు.

స్థిరమైన ఆపరేషన్స్ లక్ష్యం

వర్కింగ్ కేపిటల్ అడ్వాన్స్, ముడిపదార్థాల రూపంలో ఆర్‌ఐఎన్ఎల్ కోసం సుమారు రూ.800-900 కోట్లు లభ్యతను సులభతరం చేసేందుకుగానూ ప్రతి నెలా 90 వేల టన్నుల కాస్ట్ బ్లూమ్‌లను ప్లాంట్ స్టీల్ మెల్టింగ్ షాప్-2 మిగతా 2లో..

సిఎం జగన్‌కు సాదర స్వాగతం



సిఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రులు బూడి, అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అల్లూరి సీతారామరాజు జిల్లా చింత పల్లిలో నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసే క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి గురువారం ఉదయం 10:18 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర మంత్రులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్ట్ వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటి, మిగతా 2లో..

23 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

▶ వార్త 2లో..

30న మహాధర్నాను జయప్రదం చేయండి

▶ వార్త 2లో..

ట్యాబుల ద్వారా ఉత్తమ బోధన

▶ వార్త 6లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 10వ అంకె మాదిరి కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పదో రోజుకు సమ్మె

పోరాటాన్ని ఉధృతం చేసిన అంగన్‌వాడీలు

వార్తలు 8లో..

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేరుస్తాం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేరుస్తామని, తక్షణం విధుల్లోకి చేరాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కొన్ని అంశాలపై స్పష్టత కోరుతూ ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసినట్టు వెల్లడించారు. సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు మూడు నెలల సమయం అవసరమన్నారు. కొన్ని రోజుల నుంచి అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెపై బొత్స స్పందిస్తూ విశాఖలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రాట్యుటీ పెంపు, మినీ సెంటర్ల అప్‌గ్రేడ్, ఉద్యోగోన్నతి కల్పన తదితర డిమాండ్లకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలమని ప్రకటించారు. ఇటీవల మంత్రుల బృందం, అధికారులతో జరిగిన చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన అన్ని అంశాలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. సేవా ముగింపునకు ఇచ్చే ప్రయోజన మొత్తాన్ని రూ.50,000 నుంచి 1,00,000 వరకు అంగన్వాడీ కార్యకర్తకు, అంగన్వాడీ హెల్పర్‌ను రూ.20 వేల మిగతా 2లో..

విశాఖ ప్రజలను నిరాశపరిచిన యువగళం

ప్రధాన సమస్యలను ప్రస్తావించని నేతలు : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ విజయనగరం జిల్లా పోలిపల్లిలో బుధవారం నిర్వహించిన యువగళం బహిరంగసభ ఉపన్యాసాలు విశాఖ ప్రజలను నిరుత్సాహానికి గురిచేసాయని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలని వెయ్యి పైచిలుకు రోజులుగా విశాఖలోనూ, రాష్ట్రంలోనూ ఉద్యమం జరుగుతోందన్నారు. ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీసి ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర మోడీ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఎపి పునర్విభజన చట్టం హామీలు అమలు చేయలేదని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని, రైల్వే జోన్ నిర్మాణం ప్రారంభించలేదని తెలిపారు. సంవత్సరానికి రూ.5 వేల కోట్లు ఆదాయాన్ని సమకూరుస్తున్న వాల్తేర్ రైల్వే డివిజన్‌ను రద్దు చేసి ఒడిశాకు తరలించారని, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు నిధులు ఇవ్వలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు, కేంద్ర విద్యాసంస్థల నిర్మాణాలను పూర్తి చేయలేదన్నారు. కేంద్ర బిజెపి చేస్తున్న ఈ ద్రోహం వల్ల విశాఖపట్నం, ఉత్తరాంధ్ర, రాష్ట్ర ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. యువగళం సభలో తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలు బిజెపి ద్రోహంపై ప్రశ్నిస్తారని ప్రజలు ఆశించినప్పటికీ వాటి ప్రస్తావన లేదన్నారు. అంతటితో ఆగక రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని రాబోయే ఎన్నికల్లో కలిసి రావాలని ఈ సభలో ఆహ్వానం పలకడం విశాఖపట్నంతో పాటు రాష్ట్ర ప్రజలకు తీవ్ర నష్టం చేసే చర్య అన్నారు.

ఇప్పటికే అధికార వైసిపి ప్రభుత్వం ప్రధాన సమస్యలపై కేంద్రాన్ని నిలదీయలేకపోతోందని, కేంద్రం ముందు సాగిలపడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కన్నా తన అధికారం కోసమే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వేతన తిప్పలు

క్రాఫ్ట్, పిఇటి పార్ట్ టైం టీచర్స్, జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మెసెంజర్స్, సిస్టం అనలిస్టులు, అసిస్టెంట్ సెక్టోరియల్స్, సైట్ ఇంజినీర్స్, కస్తూర్బా స్కూల్స్ ప్రిన్సిపాల్స్, టీచర్స్, పిఇటిలు, సిబ్బంది, కాలేజీలో పిజిటిలు, కంప్యూటర్, ఒకేషనల్ పార్ట్ టైం టీచర్స్, అకౌంటెంట్స్, ఎఎన్ఎమ్‌లు, అటెండర్స్, వంట మనుషులు, స్వీపర్స్, డే అండ్ నైట్ వాచ్-ఉమెన్స్, స్కావెంజర్, ఉర్దూ, అరబిక్ టీచర్స్ ఇలా వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారు. వీరికి కనీస ఉద్యోగ భద్రత, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలుకావడంలేదు.

విశాఖ ప్రజలను నిరాశపరిచిన యువగళం

విధానాలను రాష్ట్రంలో అమలు జరిపి ప్రజలపై పెనుభారాలు వేస్తోందన్నారు. దీనికి భిన్నంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం, దీని మిత్రపక్షం జనసేన యువగళంలో పై సమస్యలపై గర్జిస్తాయని ప్రజలు ఆశించినా నిరాశే మిగిలిందన్నారు. ఆ నేతల ప్రకటనలు అధికార సాధన కోసం ఆరాటం తప్ప ప్రజల కీలక సమస్యలపై లేవని ఇట్టే అర్థమవుతుందన్నారు. బిజెపి ద్రోహంపై పోరాడకుండా ఆ పార్టీలు రాష్ట్ర ప్రజలకు ఎలా న్యాయం చేస్తాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల పునాది వల్లే విశాఖపట్నం మహానగరం అయ్యిందన్నారు. మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. విశాఖ నగర విధ్వంసానికి పూనుకున్న బిజెపికి వ్యతిరేకంగా వైసిపి, తెలుగుదేశం, జనసేన పోరాడకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రజల ప్రయోజనాలను కాపాడలేవు అన్నారు.

యువగళం పాదయాత్ర సందర్భంగా స్టీల్ టౌన్‌షిప్‌కి లోకేష్ వచ్చిన సందర్భంగా బ్లాస్ట్‌ఫర్నేస్-3ను జిందాల్‌కు ధారాదత్తం చేయడంపై ఉక్కు పోరాట సంఘం నాయకులు స్పందించాలని అడిగినా లోకేష్ స్పందించలేదని, దీంతో కార్మికులు తీవ్ర నిరాశ చెందారని అన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు బిజెపి ఎడల తమ వైఖరిని పునరాలోచించుకోవాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం, ఉత్తరాంధ్ర ప్రయోజనాలు, విభజన చట్టంలోని హామీల సాధన కోసం బిజెపిపై పోరాడతామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేరుస్తాం : బొత్స

నుంచి 40 వేల వరకు పెంచి ఇవ్వనున్నట్టు తెలిపారు. అంగన్వాడీ సహాయకులను వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న 45 సంవత్సరాల వయస్సును 50 సంవత్సరాలకు పెంచుతామన్నారు. ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతామని, సిడిపిఒ స్థాయిగల ప్రాజెక్ట్ అధికారి వద్ద జరిగిన సమావేశాలకు టిఎ, డిఎ బిల్లులను అందిస్తామని అన్నారు. మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చడానికి తగిన అంశాలను పరిశీలిస్తామన్నారు.

సిఎం జగన్‌కు సాదర స్వాగతం

పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, బివి.సత్యవతి, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విమానాశ్రయం నుంచి 10.38 గంటలకు బయలుదేరి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి ప్రత్యేక హెలికాప్టర్‌లో జగన్ వెళ్లారు. ఆయన వెంట మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్ ఉన్నారు.

జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ ఎంఒయు

(ఎస్ఎంఎస్-2) నుంచి జెఎస్‌పిఎల్‌కు సరఫరా చేయడానికి ఎంఒయూ కుదిరింది. దీని వల్ల నెలకు రూ.500 కోట్లు వరకూ టర్నోవర్ పెరుగుతుందని, దాదాపు రూ.100 కోట్ల మేర నష్టాన్ని తగ్గించే చర్యలకు ప్రాధాన్యమిచ్చినట్టవుతుందని యాజమాన్యం వాదిస్తోంది.

అరకొరగానే ఒప్పంద వివరాల వెల్లడి

స్టీల్‌ప్లాంట్‌కు చెందిన యూనియన్‌లన్నీ ఒప్పంద వివరాలన్నిటినీ కార్మికులకు తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నా ఒకటి రెండు విషయాలను మాత్రమే తాజాగా యాజమాన్యం వెల్లడించింది. ముఖ్యమైన ఫిక్స్‌డ్ కాస్ట్‌లో ఉన్న ఉద్యోగుల జీతాలు, రిపేర్లు మెయిన్‌టెనెన్స్, డిప్రియేషన్, ఇంట్రస్ట్‌లు కలిపి రూ.550 కోట్ల ఫిక్స్‌డ్ కాస్ట్ చెల్లింపుల విషయంలో జిందాల్ ససేమిరా అనడంతో పెద్ద ఎత్తున ఆర్థిక భారం ప్లాంట్‌పై పడబోతుందని తెలుస్తోంది. ఎంఒయులో ఈ అంశం ఉన్నా యాజమాన్యం దాచిపెడుతుందని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తప్పుపడుతున్నారు. యాజమాన్యం దీన్ని బహిర్గతం చేయకుంటే ప్లాంట్‌కు నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే ఈ రూ.550 కోట్ల ఫిక్స్‌డ్ కాస్ట్ భారం అంతా బ్లాస్ట్ ఫర్నేస్ - 1, 2లపై పడి టర్నోవర్ కాదు కదా నష్టాలు తీవ్రమవుతాయని కార్మికులంతా ఆవేదన చెందుతున్నారు.

ఎంఒయును రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై జిందాల్‌తో చేసుకున్న ఒప్పందాన్ని తక్షణం రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 994వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు గళమెత్తాలన్నారు.

23 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో



సమావేశంలో పాల్గొన్న శ్రీను, క్రెడాయ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 23, 24, 25 తేదీలలో ఎంవిపి కాలనీలోని గాది రాజు ప్యాలెస్ వేదికగా క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో 9వ ఎడిషన్ నిర్వహిస్తున్నామని కార్యదర్శి, ఎక్స్‌పో - 2023 కన్వీనర్ వి.శ్రీను తెలిపారు. గురువారం సాయంత్రం శివాజీ పాలెంలోని క్రెడాయి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మకం దారులను, కొనుగోలుదారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నాణ్యతతో కూడిన సొంత ఇంటి కలలను సాకారం చేసుకుందుకు తాము ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సొంతిల్లు కొనుగోలు చేసే వారికి బ్యాంక్ లోన్ సాదుపాయాన్ని కూడా అదే వేదికగా అందేలా చూస్తామన్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ ఎక్స్‌పో ప్రారంభం అవుతుందని, మధ్యాహ్నం 1.00 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగావైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి హాజరవుతారని తెలిపారు. గత ఏడాది 13 వేల కుటుంబాలు హాజరయ్యాయని, ఈ ఏడాది 18000 కుటుంబాలు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో 96 స్టాల్స్‌లో 300 పైగా నిర్మాణాలను అమ్మకందారులు కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచుతారన్నారు. జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ వివరాలు తెలియజేస్తారన్నారు. సమావేశంలో క్రెడాయి విశాఖపట్నం చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు, అధ్యక్షులు వి.ధర్మేంద్ర, ఉపాధ్యక్షులు సిహెచ్.గోవింద్ రాజు, సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.నరసింహారావు, కమిటీ సభ్యులు ఎం.కృష్ణమోహన్‌రావు, శంక పవన్ పాల్గొన్నారు.

30న మహాధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అంబేద్కర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కేంద్రంలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ తలపెట్టిన దశల వారీ పోరాటంలో భాగంగా గురువారం సాయంత్రం ఆర్‌బిఎం యుపి స్కూల్లో జివిఎంసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో అంబేద్కర్ మాట్లాడుతూ యుటిఎఫ్ కార్యాచరణకు ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికై బుధవారం జెడి సర్వీసెస్ మువ్వ రామలింగం ఆధ్వర్యంలో విద్యా శాఖ చర్చలకు ఆహ్వానించడం, సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం పోరాటం తాలూకా ప్రభావమని తెలిపారు. కావున 30వ తేదీన రాష్ట్ర కేంద్రంలో జరగనున్న ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మున్సిపల్ ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్, జగన్, సీనియర్ నాయకులు జనార్ధన్, శోభ, సుబ్బలక్ష్మి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌పి విశాఖ కన్వీనర్‌గా కదిరి రాము

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బహుజన్ సమాజ్ పార్టీ విశాఖపట్నం జిల్లా కన్వీనర్‌గా విశాఖపట్నానికి చెందిన న్యాయవాది, సంఘ సేవకుడు, మానవ హక్కుల కార్యకర్త కదిరి రాము నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో బుధవారం జరిగిన బిఎస్‌పి రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రామును విశాఖపట్నం కన్వీనర్‌గానూ, విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగానూ నియమించినట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి ప్రకటించారు. ఆ సమావేశంలో రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి రాము మాట్లాడుతూ విశాఖలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఇన్వెస్టర్స్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ఎంవిపి.కాలనీ : సెబీ, బిఎస్‌ఇతో కలిసి నగరంలోని రామ్‌నగర్‌లో రెగస్ ఎలైట్ బిజినెస్ సెంటర్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) గురువారం ఇన్వెస్టర్స్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సేవా కేంద్రాన్ని సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వి.మురళీధర్‌రావు, ఎన్ఎస్ఇ లిస్టింగ్ అండ్ ఇన్వెస్టర్ కంప్లయింట్స్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ అంకిత్ శర్మ, రీజనల్ రెగ్యులేటరీ ప్రతినిధి సంతోష్ మోహన్‌దాస్ ప్రారంభించారు.

అడ్డంకులు సృష్టించినా యువగళం విజయవంతం


మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు యువగళం కార్యక్రమాన్ని విజయవంతం చేశారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం సభ ఫెయిల్ అవ్వాలని వైసిపి ప్రభుత్వం కంకణం కట్టుకుని అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందని తెలిపారు. ప్రజల్లో తిరుగుబాటు వస్తే జగన్ అడ్డుకోలేడని యువగళం హెచ్చరించిందన్నారు. 2024లో జరిగే ఎన్నికలు జగన్‌కి టిడిపి, జగన్‌కి జనసేన మధ్య కాదని, జగన్‌కు ప్రజలకు మధ్య పోటీనని అన్నారు. అందుకే ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, గండి బాబ్జీ పాల్గొన్నారు.

జగన్‌కు బుద్ధి రావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గురువారం పుట్టినరోజు జరుపుకున్న సిఎం జగన్మోహన్ రెడ్డికి ఇక నుంచైనా మంచి బుద్ధి రావాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ఎందుకు ఇన్ని వేల ఎకరాలు దోచేస్తున్నావు.. ఎవరికైనా ఆరడుగుల స్థలం చాలు కదా అని ఎద్దేవా చేశారు. జగన్‌పై ఉన్నన్ని కేసులు రాజకీయ నాయకుల్లో ఇంకెవరిపైనా లేవన్నారు. గిరిజనులకు ఏం పొడిచారని చింతపల్లికి వెళ్లారని ప్రశ్నించారు. ఏజెన్సీలో మంజూరు చేసిన హైడ్రో ప్రాజెక్టును గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో పలువురు మాజీ మంత్రులు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో జగన్ జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను ఉమ్మడి విశాఖ జిల్లాలో సేవా కార్యక్రమాలతో నిర్వహించారు. వైసిపి శ్రేణులు కేక్ కటింగ్‌లు, పేదలకు దుస్తులు, రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ, అన్నసమారాధనలు, రక్తదాన శిబిరాలను నిర్వహించారు.

-(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)



భీమిలిలో రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం : స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు.200 మంది రక్తదానం చేశారు వైసిపి యువజన విభాగం అధ్యక్షులు ముత్తంశెట్టి శివ నందీష్, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు పాల్గొన్నారు

భీమిలి మండలం టి.నగరపాలెం వైఎస్ఆర్ విగ్రహం వద్ద సర్పంచ్ పొట్నూరు చాయాగౌతమి ఆధ్వర్యాన కేకు కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు (వాసురాజు), జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, ఎంపిటిసిలు పల్లా నీలిమ, చెల్లూరి నగేష్ బాబు, సింగనబంద సర్పంచ్ గాడు వెంకట నారాయణ పాల్గొన్నారు ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు ఎంపిపి వాసురాజు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ డి పెదబాబు, యలమం చిలి సూర్యనారాయణ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు

సీతమ్మధార :ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, వికెసిపిఆర్ ఛైర్మన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, ఇతర నేతలు, కార్పొరేటర్లతో కలిసి కె.కె.రాజు కేక్ కట్ చేసారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. పేద మహిళలకు చీరలు, కుట్టుమిషన్లు పంపిణి చేసారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, చల్లా రజినిఈశ్వరరావు, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ పాల్గొన్నారు.

47వ వార్డు అరుంధతినగర్‌లో స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో అన్నసమారాధనను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. కేక్ కట్ చేశారు. జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, 47వార్డు నాయకులు గురువొజి, సుకుమార్, విజయ్, రాఘవులు, నరసింగ్, సురేష్, కనకరాజు, లక్ష్మణ్, వాసు, జయ కుమార్, రమేష్, సాగర్, నాగరాజు, అప్పన్నదొర, శ్రీను పాల్గొన్నారు.

ఆరిలోవ: 11వ వార్డు వైసిపి నేత గొలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని జివియంసి వృద్ధులు, నిరాశ్రయుల ఆశ్రమంలో సిఎం జగన్ పుట్టిన రోజు వేడుకల్లో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొని వృద్ధులు, నిరాశ్రయులతో కేకు కట్ చేయించారు. స్వయంగా మధ్యాహ్నం భోజనం వడ్డించి, తర్వాత దుప్పట్లు పంపిణీ చేశారు.

12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్ ఆధ్వర్యంలో పెదగదిలి కూడలిలోతూర్పు ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. 100మంది మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ చేసారు. వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందా రెడ్డి, కన్నేటి సుబ్బా రెడ్డి, పిఐ.బాలరాజు పాల్గొన్నారు.



ఆరిలోవలో నిరాశ్రయులతో కేక్ కట్ చేయిస్తున్న మేయర్

13వ వార్డులో... కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ ఎస్‌కెఎంఎల్ నగర్‌లోశంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో వైద్యశిబిరం నిర్వహించారు. 175 మందికికంటి పరీక్షలు చేశారు. న్యూ లైఫ్ బ్లడ్ క్యాంప్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.. వైసిపి నేతలు విక్టర్, పారిపల్లి రామారావు, సత్యల సాగరిక, వెంకట్, వెంకట రెడ్డి పాల్గొన్నారు.

వేపగుంట : 52వ వారు శాంతినగర్ డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద సిఎం జగన్ జన్మదినం సందర్భంగా వైసిపి శ్రేణులతో కలిసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కేకు కటింగ్ చేశారు. పేద మహిళలకు చీరలను పంపిణీ చేసారు. నాయకులు ఆల్ఫాకృష్ణ, జియ్యాని మారుతి, జియ్యాని విజయ్, వెదుళ్ల శ్రీను పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రోగులకు రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, సర్పంచ్ జయ రత్నకుమారి పాల్గొన్నారు. వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సిహెచ్‌సిలో రోగులకు రొట్టె, పండ్లు పాలు పంపిణీ చేశారు.

కొత్తకోట: జగన్ జన్మదినం సందర్భంగా మేజర్ పంచాయతీ ఆవరణలో కేక్ కట్ చేశారు. సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్మడి సత్యదేవ్, శీలం కళ్యాణ్, ఎంపీటీసీలు కుంచా లక్ష్మి శంకర్, పూడి దేవా, శీలం శంకర్రావు, శివకేశవ ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మడి దొరబాబు, ఉమా పాల్గొన్నారు.



ఆనందపురంలో లిటిల్ హగ్స్ పిల్లలకు మధ్యాహ్న భోజనం

ఆనందపురం : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ఆనందపురం కూడలిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. భీమిలి ఎఎంసి డైరెక్టర్, జిల్లా గ్రీవెన్స్ విభాగం జనరల్ సెక్రటరీ రౌతు శ్రీను సొంత నిధులతో తలవలసలోని భరోసా లిటిల్ హగ్స్ ట్రస్ట్‌లో 30 మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం, చాపలు, పండ్లు పంపిణీ చేశారు.

కోటవురట్ల: మండల కేంద్రంలో మండల వైసిపి అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు హాజరయ్యారు.

యస్.రాయవరం: మండల కేంద్రంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి జడ్పిటిసి కాకర్ల దేవి, ఎంపీపీ కోన రామలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు నివాళి అర్పించారు. సర్వసిద్ధి, పెనుగల్లు పిహెచ్‌సిల్లో రోగులకు పండ్లు పంచిపెట్టారు. కొలతల శ్రీను, ఉప్పరపల్లిసర్పంచ్ శ్రీరాములు, వార్డ్ మెంబర్ శ్రీను పాల్గొన్నారు.

రావికమతం :మండల పరిషత్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, ఎంపీపీ పైల రాజు కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఇళ్లపు సన్యాసినాయుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మూర్తి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, మున్సిపల్ ఛైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురంలోసిఎం జగన్ జన్మదిన కేకును డిసిసిబి మాజీ ఛైర్మన్ యు సుకుమారవర్మ కేక్ కట్ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, పార్టీ నాయకులు దేశం శెట్టి శంకర్రావు, కోన బుజ్జి, పిన్నమరాజు వాసు, కే విమల నాయుడు, గొర్లి అశ్విని నూకరాజు, లాలం శ్రీనివాసు పాల్గొన్నారు.

అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ, ఆసుపత్రి సిబ్బందికి లంచ్ క్యారియర్లు అందజేశారు. కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపరిండెంట్ ఎస్.శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. జివిఎంసి 81వ వార్డు పరిధిలో కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో, 80వ వార్డులో కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు ఆధ్వర్యంలో 150 మంది పేదలకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. 80వ వార్డు పరిధిలో కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక లక్ష్మీదేవిపేటలో డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు అందజేశారు.

వైద్య శిబిరం

డాక్టర్ వైయస్సార్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుల డాక్టర్ కె.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో స్థానిక జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు ఉచిత వైద్యసేవలు, మందులు పంపిణీ చేశారు. చెవి ముక్కు గొంతు సమస్యలపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సభ్యులు ఈశ్వరరావు, నాయుడు, శ్రీను పాల్గొన్నారు.



అనకాపల్లిలో కేకు కట్ చేస్తున్న రత్నాకర్, వైసిపి నేతలు

గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

సబ్బవరం : వైసిపి మండల కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కేక్ కటింగ్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి నేతలు బోకం రామునాయుడు, కర్రి బాబు, సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, కాపుసెట్టి శేషుబాబు, బంతికోళ్ల పద్మ, జెట్టి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

కశింకోట : ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా ఉగ్గినపాలెం గ్రామంలో ఎంపీపీ కలగా లక్ష్మి కేక్ కటింగ్ చేశారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.

చోడవరం : పార్టీ కార్యాలయం, అడ్డూరు, పిఎస్‌పేట గ్రామాల్లో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కేక్ కట్ చేశారు. పిఎస్.పేటలో పేదలకు వస్త్రాలు అందించారు. లక్కవరంలో డాక్టర్ బండారు సత్యనారాయణ పేదలకు బియ్యం పంపిణీ చేశారు. వైసిపి నేతలుదొడ్డి వెంకటరావు, ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడికాసు నర్సింగరావు పాల్గొన్నారు.



గోపాలపట్నంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఆడారి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గోపాలపట్నం : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా 89వ వార్డు చంద్ర నగర్ గ్రౌండ్‌లో వైసిపి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ముందుగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. పేదల మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, నాయకులు అయితంశెట్టి కోటేశ్వరరావు, గేదెల మురళీకృష్ణ, ఐతంశెట్టి రేణుక గోపాలకృష్ణ గునిశెట్టి శ్రీనివాసరావు, ఆల్ఫా కృష్ణ, గవర నాయుడు, ఆళ్ల పైడిరాజు పాల్గొన్నారు.

యలమంచిలి : ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా యలమంచిలి గురప్ప సత్రంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, డిసిసిబి మాజీ ఛైర్మన్ తేజవర్మ పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోదెపు గోవిందరావు, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ, గుప్తా, పిఎసిఎస్ ఛైర్మన్ మళ్ల కొండబాబు, లైన్‌కొత్తూరు సర్పంచ్ కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు

దేవరాపల్లి : ఎం.అలమండ గ్రామంలో సర్పంచ్ దాడి జగన్, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శంకర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని కేక్ కట్ చేశారు. రోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. జడ్పిటిసి కర్రి సత్యం, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, వైసిపి నాయకులు బూరె బాబురావు, రొంగలి నారాయణమ్మ, ఎంపీటీసీ పోతల వెంకటరావు, పార్థసారథి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. వైసిపి నాయకులు జోగా కొండబాబు, కొలిమల్ల అచ్చం నాయుడు, కోరుకొండ అప్పలనాయుడు, సుంకర శ్రీనివాసరావు, సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ :ఉమ్మలాడ అంగన్వాడీ కేంద్రంలో వైసీపీ నాయకులు, సర్పంచ్ తనయుడు సూరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యాన ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బుద్ధ తాత నాయుడు పాల్గొన్నారు. ఒక వైపు అంగన్వాడీలు తమ సమస్యలపై ఆందోళన చేస్తుండగా, మరోవైపు ఈ విధంగా వైసిపి నాయకులు అంగన్వాడీ కేంద్రంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించడం, అందులో ప్రధానోపాధ్యాయుడు పాల్గొనడంపై విమర్శలు వినిపించాయి.

పాయకరావుపేట: సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను వైసిపి మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, దగ్గుపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించారు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జడ్పిటిసి లంక సూరిబాబు, ఎంపీపీ పార్వతి తాతారావు, జగత శ్రీను పాల్గొన్నారు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గూటూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహించారు. దేవర సూర్యచక్రం, వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠ స్వామి, రామకృష్ణ, అశోక్ చక్రవర్తి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు



పాయకరావుపేటలో చిక్కాల ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుక

చిరు వ్యాపారుల పొట్టకొట్టొద్దు

- బర్మాక్యాంపు రోడ్డులో యథాస్థితి కొనసాగించాలి
- సిఐటియు ఆధ్వర్యాన బాధితుల ధర్నా.. జెడ్‌సికి వినతి



చిల్లర వర్తకులతో ధర్నాలో పాల్గొన్న బొట్టా ఈశ్వరమ్మ, ఒమ్మి అప్పారావు

ప్రజాశక్తి- విశాఖపట్నం : బర్మా క్యాంపు చిల్లర వర్తకులను యథాస్థానంలో వ్యాపారం చేసుకోనివ్వాలని సిఐటియు నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, ఒమ్మి అప్పారావు డిమాండ్ చేశారు. బర్మా క్యాంపు రోడ్డు నిర్మాణం పేరుతో 30 కుటుంబాలకు చెందిన తోపుడు బళ్ళు, బడ్డీలను అధికారులు తొలగించడం దుర్మార్గమన్నారు. గురువారం జివిఎంసి ఐదో జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బర్మాక్యాంపు రోడ్డులో చిల్లర వ్యాపారాలను తొలగించడాన్ని నిరసిస్తూ బాధిత వ్యాపారులు ధర్నా చేశారు. జెడ్‌సికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ తోపుడుబండ్ల కార్మికులను ఎక్కడున్న వారిని అక్కడే వ్యాపారం చేసుకోనివ్వాలని, చిల్లర వర్తకులకు భద్రత, భరోసా కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి లేక కుటుంబపోషణకు గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డు పక్కన వ్యాపారాలను తొలగించి, ఇలా వారిని రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు. చిరువర్తకుల పొట్ట కొట్టొద్దని అధికారులు, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు పి.మూర్తి, పి వెంకటరావు, ఎ.సింహాచలం, ఎం ఈశ్వరరావు , తోపుడు బళ్ల కార్మికులు, చిల్లర వర్తకులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం : మేయర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : నగర ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు మౌలిక వసతులతో కూడిన సమగ్రాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. గురువారం 11వ వార్డు గాంధీనగర్, శ్రీరామనగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో రూ 1.24 కోట్లతో సిసి రోడ్డు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి నిధులతో అన్నివార్డులను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, వైసిపి, గ్రామ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న కార్పొరేటర్, జెడ్‌సి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ, వార్డు సచివాలయం పరిధిలో 1307 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముతో కలిసి వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం పంపిణీ చేశారు. యుపిహెచ్‌సి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు

అనిట్స్ అధ్యాపకునికి డాక్టరేట్



ప్రొఫెసర్ వెంకట గౌరవ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస, అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ గుడిపల్లి వెంకటగౌరవకు గీతం యూనివర్సిటీ గురువారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రొఫెసర్ కె రామకృష్ణ పర్యవేక్షణలో 'కంప్యూటేషనల్ స్టడీస్ ఆఫ్ 5 - సెల్ఫోనమైడెన్, 2,4(1 హెచ్,3 హెచ్) డయోన్‌డెరివేటి వ్స్' అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన థీసెస్‌కు పిహెచ్‌డి వచ్చిందని ప్రొఫెసర్ వెంకట గౌరవ తెలిపారు. కేన్సర్, హెచ్ఐవి వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు ఉపయోగపడే నూతన ఔషధాల తయారీ ప్రక్రియకు ఈ పరిశోధనా ఫలితాలు దోహదపడతాయని తెలిపారు

వైకుంఠ ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఈనెల 23న వైకుంఠ ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఇఒ శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం వివిధ విభాగాధిపతులతో కలిసి క్యూలైన్లు, తాగునీరు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. పలు అంశాలపై చర్చించారు. 23న శనివారం వేకువజామున 5 30 గంటల నుంచి 11.30గంటల వరకు ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పిస్తామన్నారు. క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సేపు వేచియుండకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ రోజున ఆర్జిత సేవలు, అంతరాలయ దర్శనాలను రద్దు చేస్తామన్నారు కొండ దిగువనున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు, డిఇఇ హరినాగేశ్వరరావు , ఎఇఇ బాబ్జీ, దేవస్థానం ఎఇఒ నర్సింహరాజు, పాలూరి నరసింగరావు, పర్యవేక్షకులు రమణ, కనకరాజు, పిఆర్ఒ నాయుడు ఉన్నారు.

పర్యావరణ నమూనాకు ప్రథమ బహుమతి

ఆకట్టుకున్న మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు గురువారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. జివిఎంసి ఒకటో జోన్ రాయిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని విజయదుర్గ ప్రదర్శించిన 'అవర్ ఎన్విరాన్‌మెంట్, అవర్ రెస్పాన్సిబిలిటీ' నమూనా వ్యక్తిగత విభాగంలో మొదటి బహుమతి గెలుచుకుంది. నాలుగో వార్డు చినఉప్పాడ ఎంపియుపి పాఠశాల విద్యార్థిని సిహెచ్‌వి సుప్రజ 'హైడ్రాలిక్ జాక్' నమూనా ద్వితీయ బహుమతిని, తాటితూరు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి పి జశ్వంత్ 'గ్యాస్ కట్టర్స్' నమూనా తతీయ బహుమతి గెలుచుకున్నారు గ్రూప్స్ విభాగంలో చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు అబ్దుల్, పి.గణేష్ ప్రదర్శించిన 'ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్' నమూనా ప్రథమ బహుమతిని, పిఎన్ఎం హైస్కూల్ విద్యార్థులు పి ధనుష్, ఎం కార్తీక్ ప్రదర్శించిన 'క్లౌడ్ బరస్ట్ ఇండికేటర్' నమూనా ద్వితీయ బహుమతిని, చిట్టివలస, జెడ్‌పి బాలికల హైస్కూల్ విద్యార్థినులు సిహెచ్.లాస్య, పి సుస్మిత ప్రదర్శించిన 'బేసిక్ జామెట్రికల్ ఐడియాస్' నమూనా తతీయ బహుమతి గెలుచుకుంది. పోటీలకు డైట్ అధ్యాపకులు జె మాధవి, ఎ సోమయాజులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒలు ఎం.శివరాణి, ఎ జయప్రద అభినందించారు

దుప్పట్లు, చీరల పంపిణీ



చీరలు, దుప్పట్లు అందజేస్తున్న సిస్టర్ అనిత, నిర్మల

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ విశాఖ మరియా మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరిలోవ శ్రీలీలాసుందరయ్యనగర్, అమెరికన్ హాస్పిటల్ ఆవరణలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు గురువారం నిర్వహించారు. సిస్టర్స్ అనిత, సాలి, ఆని, నిర్మల పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం వందమంది పేదలు, ట్రాన్స్‌జెండర్స్‌కు చీరలు, దుప్పట్లు, కిరాణా సామాన్లు అందజేసారు.

ఎసిబి వలలో హెడ్ కానిస్టేబుల్

రూ.ఐదు వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం

ప్రజాశక్తి -గాజువాక : రూ.ఐదు వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు గాజువాక పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పట్టా రాజశేఖర్ గురువారం చిక్కారు. ఎసిబి డిఎస్‌పిరమ్య ఆధ్వర్యంలో పక్కా నిఘాతో మాటువేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలివి.

గాజువాక చెందిన షేక్ రసూల్ అనే వ్యక్తి ఇంట్లో తగాదాలు కారణంగా ఆయన తండ్రిపై దాడి చేశాడు. దీనిపై బాధితుడు గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది.రూ.ఐదు లక్షలు లంచమిస్తే కేసు లేకుండా చేస్తానని రసూల్‌పై ఒత్తిడి తేగా, అతను ఎసిబిని ఆశ్రయించారు. దీంతో ఎసిబి డిఎస్‌పి రమ్య ఆధ్వర్యంలో గాజువాక పోలీస్‌స్టేషన్ బయట మాటువేసిన ఎసిబి యంత్రాంగం, హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్‌కు లంచం ఇస్తుండగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా గాజువాక పోలీస్‌స్టేషన్‌లోరైటర్‌గా పనిచేస్తున్న సమయంలో రాజశేఖర్‌పై అనేక అవినీతి ఆరోపణ రావడంతో రైటర్ సీట్ నుండి తప్పించారు. ఇపుడు ఒక కేసు విషయంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం: పరదేశిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ నిర్వహణ, మరమ్మతులను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 22న శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు. వెల్లంకి, కల్లివానిపాలెం, బోయపాలెం, గంభీరం తదితర ప్రాంతాలకు విద్యుత్ ఉండదని, గృహ వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేటికీ అందని నవంబర్ నెల జీతాలు

- జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి- విశాఖపట్నం : క్రిస్మస్ పండగ దగ్గరికి వస్తున్నా తమకు నవంబర్ నెల వేతనాలు ఇంకా అందకపోవడంతో వైద్యఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దసరా, దీపావళి, ఇపుడు క్రిస్మస్ ఇలా అన్ని పండగలకు సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు గోపి, వీరబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 196 కేడర్‌లతో 22వేల మంది ఎన్‌హెచ్ఎంలో విధులు నిర్వహిస్తుండగా, ఉమ్మడి విశాఖలో 1500మందికి పైగా ఈ విభాగంలో పనిచేస్తున్నారు. తమకు కేంద్రం, రాష్ట్రం 60: 40 నిష్పత్తిలో వేతనాలు చెల్లించాల్సి ఉందని, అయినా ప్రతినెలా సకాలంలో వేతనాలు అందక ఆలస్యం కావడంతో అవస్థలు పడక తప్పడం లేదని వాపోతున్నారు. వేతనాలు సక్రమంగా అందకపోవడం వల్ల ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యావసరాలు, ఇలా నెలవారీ కుటుంబపోషణ వ్యవహారాలన్నీ ఎలా సాగుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రతినెలా ఒకటోతేదీన వేతనాలు చెల్లింపు చర్యలు చేపట్టాలని, అలాగే ప్రస్తుతం క్రిస్మస్‌కు వచ్చేనెలలో వచ్చే సంక్రాంతి ముందే వేతనాలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. దీనిపై నేషనల్ హెల్త్ మిషన్ ఎండి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ తక్షణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ



టిడిపి కార్యకర్త అప్పారావును పరామర్శిస్తున్న పిట్టా సురేష్

ప్రజాశక్తి -తగరపువలస : లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సభకు విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, పోలిపల్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో నేలబావిలో ప్రమాదవశాత్తు పడి, స్వల్పగాయాలతో బయటపడిన జివిఎంసి ఒకటో వార్డు కొత్తపేటకు చెందిన టిడిపి కార్యకర్త ఎ.అప్పారావును విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్, నాయకులు నరసింగరావు గురువారం అప్పారావు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. కొంతఆర్థిక సాయం చేశారు. పోలిపల్లి వెళ్లి తిరిగొస్తుండగా, అప్పారావు బావిలో పడినట్లు అటుగా వెళ్తున్న పోలీసులు, టిడిపి కార్యకర్తలు గమనించి తాళ్లసాయంతో అప్పారావున బయటకు తీసి, ప్రథమ చికిత్స అందించారు

సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : పేద ప్రజలు, కార్మికుల, కష్టజీవుల హక్కుల సాధనకు, వారి సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసిన ఘనత సిపిఐకి ఉందని ఆ పార్టీ మధురవాడ ఏరియా కార్యదర్శి వి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర సమితి పిలుపుమేరకు గురువారం శివశక్తినగర్‌లో సిపిఐ మధురవాడ ఏరియా సమితి ఆధ్వర్యంలో 99వ వ్యవస్థాపక దినోత్సవాలను నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ నేత కేశవయ్య ఎగరవేశారు. ఈనెల 26వరకు సిపిఐ వ్యవస్థాపక దినోత్సవాలను సందర్భంగా వివిధ సమితుల ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎం.ఎ. బేగం, ఫాతిమా, మొదలవలస సత్యనారాయణ, అజర్, రమణమ్మ పాల్గొన్నారు.

15 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 15 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. గురువారం పిహెచ్‌సిలో నిర్వహించిన ప్రత్యేక కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరంలో కెజిహెచ్ సర్జికల్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆనంద్ పాల్గొని ఆపరేషన్లు చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ గంగునాయుడు, డాక్టర్ షహనాజ్ సాదియా, సిహెచ్ఒ సాంబమూర్తి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్
సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలంటూ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె న్యాయ సమ్మతమైనదని, వారి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అన్నారు. సమ్మెలో భాగంగా రెండో రోజైన గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడం దారుణమన్నారు. జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చే వరకూ సమ్మెను విరమించవద్దని అన్నారు. నాయకులు వి.పుండరీకాక్ష, ఎల్.చైతన్య, పి.గణపతిరావు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ధర్నా శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు రాజు, ప్రభాకర్ సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : తమ డిమాండ్ల సాధన కోసం అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు పలువురి మద్దతు లభిస్తుంది. గురువారం ఏపీ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు బి శ్రీనివాసరావు, స్టేట్ బిఎస్పీ అధ్యక్షులు పరంజ్యోతి, జిల్లా బీఎస్పీ అధ్యక్షులు రాజు యాదవ్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పీల గోవింద సత్యనారాయణ, అనకాపల్లి ఎస్టియు జనరల్ సెక్రెటరీ కోడూరి పరదేశి, పరవాడ ఏపీటీఎఫ్ అధ్యక్షులు ఎంవిఆర్ మూర్తి, పరవాడ ఏపీటీఎఫ్ జనరల్ సెక్రెటరీ అమ్మి నాయుడు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు పూడి వెంకట్రావు, పట్నాల సతీష్, ప్రత్యేక సలహాదారులు అచ్యుత కష్ణ, ప్రెసిడెంటు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ రామచంద్ర పాల్గొన్నారు.



విశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నాలో పాల్గొన్న సిఐటియు నేతలు



చోడవరంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

భూ హక్కు చట్టంపై న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి -చోడవరం
ఏపీ ప్రభుత్వ రూపొందించిన 27/2023 భూహక్కు చట్టం పేద మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ చోడవరం కోర్టు వద్ద న్యాయవాదులు గురువారం దీక్ష ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల డేవిడ్, కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన భూ హక్కు చట్టం వలన సామాన్యులు భూహక్కులను కోల్పోతారన్నారు. ధనవంతులు, పలుకుబడి కలిగిన వారు భూమిని స్వాధీనం చేసుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రెవెన్యూ శాఖ అవకతవకలకు పాల్పడినప్పుడు కోర్టును ఆశ్రయించి బాధితులు న్యాయం పొందే వారిని, ఈ చట్టం వలన రెవెన్యూశాఖకు సర్వాధికారం ఉండటంతో కోర్టుకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో చాలావరకు పేదలు నష్టపోతారని పేర్కొన్నారు. వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జెపి సత్యనారాయణ, బి.రాజు, డీజే ప్రకాష్‌రావు, డివిఆర్ సాంబమూర్తి, వివిఎన్ మూర్తి, ఎం శ్రీనివాసరావు, ఎస్ వరలక్ష్మి, డి సత్యవతి, బి గౌరీ దేవి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఎపి భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి నమ్మి సూరి బాబు, ఉపాధ్యక్షులు కె మంజుల, సీనియర్ సభ్యులు గౌతమ్, పార్వతీశం, భరద్వాజ్ పాల్గొన్నారు

అనైతిక, తప్పుదోవ ప్రకటనలకు కళ్లెం

ప్రజాశక్తి-పరవాడ : అనైతిక వ్యాపారాలు, తప్పుదోవ పట్టించే ప్రకటనలను అరికట్టడానికి వినియోగదారుల రక్షణ చట్టం అండగా నిలుస్తుందని మండల విద్యాశాఖాధికారిణి జి.సాయిశైలజ పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ హైస్కూలులో 'ఈ-కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ' అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మోసపూరిత ప్రకటనల్లో కనిపించే సెలబ్రిటీలపై మరే ప్రకటనలోనూ కనపడకుండా వినియోగదారుల చట్టం ప్రకారం ప్రభుత్వం మూడేళ్లు నిషేధం విధిస్తుందన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం-2019 పరిధిలోకి ఇ-కామర్స్ వినియోగదారులూ వస్తారని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, పాఠశాల హెచ్ఎం విక్టోరియా రాణి, సొసైటీ ప్రతినిధులు సామోజు శ్రీను, సూరాడ రాజేంద్ర, వాసుపల్లి పుష్పమిత్ర, కస్తూరి హరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఈ-కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ' అన్న అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం వినియోగదారుల హక్కుల రక్షణ కోసం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

23న కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 23వ తేదీ శనివారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తుంది. దీనిలో భాగంగా ఉత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ గురువారం ఆవిష్కరించారు. ఉత్సవానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా ఉత్సవాన్ని తిలకించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ ఎం.వీరభద్రరావు, కుంచా చిట్టిబాబు, కుంచా చిన్ను, కోటిపల్లి శ్రీను, సిలపరశెట్టి బాబీ, మొల్లి రమణబాబు, విల్లూరి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఖైదీల్లో మానసిక పరివర్తన రావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఖైదీలలో మంచిని పెంచి చెడును విడనాడాలని మాజీ హెడ్ జైలు వార్డర్, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అంటే కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్ల నాగభూషణం తెలిపారు. స్థానిక సబ్ జైల్‌లో ఖైదీల పరివర్తన సంస్కరణలలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన సోషల్ ఇన్ కుబేషన్ సెంటర్ కార్యక్రమాన్ని సబ్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చిటికెల కృష్ణ మూర్తి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పి.ఉదయ్ కుమార్, ఫాస్టర్ ఎ.దీవెనరావు, పట్నాల కృష్ణమోహన్, సామాజిక సేవకులు వినకోట నీలేశ్ గుప్తా, జైలు సివిల్ ఉద్యోగి కె.లక్ష్మీ నారాయణ, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి-సబ్బవరం : పంట కోత ప్రయోగాలే పంట దిగుబడి, ఇన్సూరెన్స్‌కి ప్రామాణికమని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గేదెల రామారావు తెలిపారు. మండలంలోని బాట జంగాల పాలెం గ్రామంలో వరి పంటకోత ప్రయోగాన్ని గురువారం పరిశీలించారు. గ్రామంలో గొర్లె దేముళ్లకి చెందిన పంట కోత ప్రయోగాన్ని పరిశీలించగా 5 ఇంటూ 5 ప్లాట్‌లో కేవలం 5.750 కిలోలు వచ్చిందని పంట ఎండిపోయిన కారణంగా పంట దిగుబడి తగ్గిందని ఆయన తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు పంటకోత ప్రయోగం చేయునపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప గణాంకాధికారులు రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎఎస్ఓ రమాదేవి, విఏఏ హరీష్, అప్పారావు పాల్గొన్నారు.

ఎస్ఐలుగా ప్రమీలాదేవి, సన్యాసినాయుడు

ప్రజాశక్తి-వడ్డాది : ఎస్సై పోస్టుల మెయిన్స్ ప్రవేశ పరీక్షల్లో బుచ్చయ్యపేట మండలం వడ్డాదికి చెందిన కొండపల్లి ప్రమీలా దేవి సత్తా చాటారు. మొదట ప్రిలిమ్స్ తర్వాత ఈవెంట్స్‌లో ఎంపికైన ఆమె ఇప్పుడు మెయిన్స్‌లో విశాఖ జోన్‌లో ఓపెన్ కేటగిరిలో 5వ ర్యాంకు సాధించింది. బుచ్చియ్యపేట మండలంలో తొలిసారిగా ఓ మహిళ అభ్యర్థి ఎస్సైగా విజయం సాధించింది. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ప్రమీలాదేవి ఎస్సైగా సేవలు అందించాలన్న లక్ష్యంతో చదివి విజయం సాధించింది. పెళ్లయి ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తన లక్ష్యసాధనను వీడలేదు. ఇంటి వద్ద ఉంటూ కుటుంబాన్ని చూసుకుంటూనే కష్టపడి చదివింది. రెండు సార్లు విఫలమైనప్పటికీ నిరాశ చెందలేదు. చివరకు తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. గతంలో సచివాలయం మహిళ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చినప్పటికీ జాయిన్ కాలేదు. చివరకు ఎస్ఐ పోస్టుకు ఎంపికైంది. తన తల్లిదండ్రులు, భర్త మంచాల సత్తిబాబు ప్రోత్సాహంతో ఇది సాధించినట్లు చెప్పారు. ఎస్ఐగా ఎంపిక కావడం పట్ల పలువురు ఆమెను అభినందించారు.



సన్యాసినాయుడు

సన్యాసినాయుడు ఎంపిక

సబ్బవరం : మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెనగంటి సన్యాసినాయుడు ఎస్సైగా ఎంపికయ్యారు. 2022లో విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించిన ఎస్సై ఫలితాలు బుధవారం రాత్రి విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో సన్యాసి నాయుడు ఏలూరు జోన్-2 సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. ఆయన స్వగ్రామం విజయనగరం జిల్లా వేపాడ మండలం నల్లబిల్లి గ్రామం కాగా, విద్యాభ్యాసం అంతా సబ్బవరం మండలంలోని సూరెడ్డిపాలెం తన సోదరుడు భాస్కరరావు (విశాఖ డెయిరీ) వద్దనే ఉండి కొనసాగించారు. సన్యాసి నాయుడు ఎస్సైగా ఎంపిక కావడంతో భాస్కరరావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ పాడేరులో పనిచేస్తున్న సిఐ ఎల్.హిమగిరి, పార్వతీపురం ఆర్టీవో హేమలత, పోలీస్ కమ్యూనికేషన్స్‌లో పనిచేస్తున్న జి సత్యవేణిలను స్పూర్తిగా తీసుకొని ఎంపికైనట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రిపేర్ అవుతున్నట్లు చెప్పారు.

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి
రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు 26 నుండి చేపట్టే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్స్, పార్కుల కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం అనకాపల్లి జీవీఎంసీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని జిఓ ఉన్నా అమలు చేయలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు పర్మినెంట్ చేస్తామని చెప్పారని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్‌లోకి మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ అలవెన్స్ అందరికీ ఇవ్వాలని, నీటిసప్లరా, యు.జి.డి.పార్కులు కార్మికులకు సేమిస్కిల్డ్ అమలు చేయాలని, క్లాప్ డ్రైవర్లను ఆప్కాస్‌లో చేర్చి రూ.18,500 చెల్లించాలని, ఎం.ఎస్.ఎఫ్. డ్రైవర్లు, మలేరియా, వెటర్నరీ, యు.జి.డి. కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లించాలి కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, గంటా శ్రీరామ్, బొమ్మల రాము, యేసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి

నేటి కాంగ్రెస్ ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి
పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యాలపై కేంద్ర హెూంశాఖామంత్రి నుండి సమాధానానికి పట్టుబట్టిన కాంగ్రెస్, ఇండియా కూటమికి చెందిన 141 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడానికి నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్ కోరారు. ఈ ధర్నాలో ప్రజలు ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐ. ఆర్. గంగాధర్, కాళ్ల సత్యనారాయణ, ప్రొఫెషనల్ కాంగ్రెస్ నాయకులు, న్యాయవాదులు అవినాష్ ఇళ్ల రాంబాబు పాల్గొన్నారు.

మేలు రకం పశువులను ఎంచుకోవాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : అధిక పాల దిగుబడులను ఇచ్చే మేలు రకం పశువులను ఎంచుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అనిల్ రైతులకు సూచించారు. మండలంలోని తగరంపూడి గ్రామంలో గురువారం పెయ్య దూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు ప్రారంభించారు. సీతానగరం పశువైద్యాధికారి రామారావు మాట్లాడుతూ కోడెదూడల పోషణ తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వైద్యురాలు డాక్టర్ సంధ్య తమ సంస్థ ద్వారా అందించే పథకాలను వివరించారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

నవశకం బహిరంగ సభతో జగన్‌కు గుబులు

ప్రజాశక్తి-అనకాపల్లి : యువగళం నవశకం బహిరంగ సభకు 5 లక్షల మంది పైగా జన సందోహం హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో తాడేపల్లిలో జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వ్యాఖ్యానించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణను ఒకే వేదికపై చూసిన తర్వాత జగన్లో గుబులు పుడుతోందన్నారు. యువగళం పాదయాత్ర ముగింపు కాదని, ఇది నూతన నవశకం ప్రారంభాన్ని సూచిస్తుందని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు డాక్టర్ నారాయణరావు, కడిమిశెట్టి నరసింహరావు, ధనల విష్ణు చౌదరి, కోట్ని రామకృష్ణ, కుపిలి జగన్, మారిశెట్టి శంకరావు,సాలపు నాయుడు, విల్లూరి రమణబాబు, సెరగడం నాగేశ్వరరావు, దాడి వేణు, సారిపల్లి శ్రీను, బర్నికానా శ్రీను బుద్ధ భువనేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు

జాతీయ తైక్వాండో బ్లాక్ బెల్ట్‌కు అర్హత

ప్రజాశక్తి-చోడవరం : జాతీయ స్థాయి తైక్వాండో బ్లాక్ బెల్ట్, రిఫరీ సెమినార్‌లో చోడవరంకు చెందిన 21 మంది విద్యార్థినీ, విద్యార్థులు అర్హత సాధించినట్లు ఉమ్మడి విశాఖ జిల్లా తైక్వాండో ఉపాధ్యక్షులు పి.మురళీకృష్ణ తెలిపారు. క్రీడాకారులైన వేపాడ శ్రీచరన్, ఆకుల మూఖేష్, వి.లక్ష్మణ్, బొబ్బిలి సత్యరామ్ చంద్ర, కొల్లిపార తన్విత్ ఉదయ్, గండి కారుణ్య సందీప్, కె రోహిత్, బి సాయి ప్రణయ్ కుమార్, గుడ్డెటి నాగ సాయి రామ్, సోనారి తన్వాలు తదితరులు బ్లాక్ బెల్ట్‌లో, చవల చంద్ర శేఖర్ 2వ డాన్ బ్లాక్ బెల్ట్‌లో, మునష సంతోషి లక్ష్మి, పాంగి వెంకటేష్, కె చంటిబాబు, గండి మోహన్, దివాకర్, శేఖర్ బాబు, షేక్ ఆస్లాం, యమ్ శ్రీనాథరావు, ప్రసాద్, డి జాహ్నవి, కెపి కుమార్‌లు నేషనల్ రిఫరీ, రిఫ్రేషర్ అండ్ బ్లాక్ బెల్ట్‌లో అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. వీరికి ఎపి తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ టి హర్ష వర్ధన్ ప్రసాద్, సెక్రటరీ యల్‌టి చంద్ర మౌలి, బియస్‌యస్ ప్రసాద్, డివి చారి, జిల్లా సెక్రటరీ పి గణేష్ కుమార్ అభినందనలు తెలిపారు.

పిఎసిఎస్ పెట్రోల్ బంకు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఏ కోడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకుకు గురువారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసిసిబి ఆధ్వర్యంలో పనిచేస్తున్న పిఎసిఎస్‌లో రైతులకు సంపూర్ణ సహకారాలు అందిస్తూ మరోపక్క వాణిజ్య సంఘాలుగా ఎదగాలన్నారు. జిల్లాలో అనేక సంఘాలు నష్టాల బాటలో ఉన్నాయని, వాటిని అధిగమించడానికి సూపర్ మార్కెట్లు పెట్రోల్ బంకులు తదితర వ్యాపారాలు నిర్వహించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. అంతకుముందు ఉపాధి హామీ నిధులు రూ.14.40 లక్షలతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై విఆర్‌ఎల నిరసన

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్‌ఏలు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతి కుమార్ మట్లాడుతూ నాడు వీఆర్‌ఏల దీక్ష శిబిరాన్ని సందర్శించిన నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారే తప్ప అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్ళు గడిచిన ఒక్క సమస్య కూడా నెరవేర్చలేదని తెలిపారు. వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్చార్జి తహసిల్దార్ వినయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘ అధ్యక్షులు లంబ సన్యాసిరావు, ఉపాధ్యక్షులు ఎన్ శివశంకర్, కోశాధికారి ఎన్ ఈశ్వరరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో నర్సింగిబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపు వేయడం జరుగుతుందని ఆ శాఖ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టిడం కోసం విద్యుత్ కోత అమలు చేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సెయింట్ జాన్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖ అధికారులు ఎం చిట్టిబాబు, సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతిలో విద్యార్థులు కలిసి మెలిసి వుండాలన్నారు. ముందుగా కిస్మిస్ ప్రీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నోబుల్ కుమార్, కరస్పాండెంట్ భక్తుల అనురాధ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి దృష్టికి వంతెనల సమస్యలు

మండల పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బిఎన్ రోడ్డులో కూలిన వడ్డాది పెద్దేరు వంతెన, విజయరామరాజుపేట తాచేరు వంతెనల సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం విశాఖ విచ్చేసిన సీఎం జగన్‌ని కలిసి, బిఎన్ రోడ్డు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తాచేరు వంతెన నిర్మాణానికి విశాఖ జిల్లా కలెక్టర్‌కి సీఎం ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. గోవాడ సుగర్స్ బకాయిలు రూ.12.5 కోట్ల విడుదలకు కూడా సీఎం ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి దాకారపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన గురువారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయశాఖ ఎఒ మాట్లాడుతూ తుఫాను కారణంగా మండలంలో 935 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందని, 1900 రైతులను గుర్తించామని తెలిపారు. రెవెన్యూ సమస్యలు మండలం అధికంగా ఉన్నాయని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్ శివరాంపురంలో రీ సర్వేలో అధికంగా తప్పులు దొర్లినట్లు ఆ గ్రామ సర్పంచ్ తెలిపారు. పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరీష్ వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ స్మరణ రాజ్, జడ్పిటిసి దొండ రాంబాబు, కొల్లిమల్ల అచ్చం నాయుడు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, సర్పంచులు గోపిశెట్టి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూపర్‌లదే హవా?

బుచ్చయ్యపేట మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు ఎక్కడ నిబంధనల పాటించిన పరిస్థితులు కనబడలేదు. మండలంలో 35 గ్రామ పంచాయతీలకు గాను 18 మంది మహిళా సర్పంచులు, 18 ఎంపీటీసీ స్థానాలకు గాను 10 మంది మహిళా ఎంపిటిసిలు ఉన్నారు. వీరిలో కేవలం గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపిపితో పాటు మంగళాపురం సర్పంచ్ కంటే పద్మరేఖ, కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల భవాని మాత్రమే హాజరయ్యారు. అధిక సంఖ్యలో మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీల స్థానంలో వారి భర్తలు, కుమారులు, కుటుంబ సభ్యులే హాజరయ్యారు. వారంతా దర్జాగా సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో కనిపించని మహిళా ప్రజాప్రతినిధులు



ఇఒపిఆర్‌డిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

అధికారులపై ఎమ్మెల్యే రుసరుస

అంగన్వాడీల ఆందోళనకు కార్యాలయ ఆవరణలో అనుమతి ఎలా ఇచ్చారంటూ ఆగ్రహం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళనకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అనుమతి ఎలా ఇచ్చారంటూ స్థానిక శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ అధికారులపై రుసరుసలాడారు. ఈవోపిఆర్‌డి విజయలక్ష్మిపై మండిపడుతూ సరెండర్ అయిపోండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ధర్మశ్రీ వస్తుండగా, తమ సమస్యలను పరిష్కారం చేయాలని అంగన్వాడీలు నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే ధర్మశ్రీ అధికారులపై విరుచుకుపడ్డారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎలా అనుమతిస్తారంటూ మండిపడుతూ ఎంపీడీవో, ఏవోపిఆర్‌డిలను కలెక్టర్‌కు సరెండర్ చేస్తానని హెచ్చరించారు.

ఎస్ఎస్ఎన్‌సియు మృతురాలి కుటుంబానికి రూ.20.50 లక్షల నష్ట పరిహారం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్థానిక ఎస్ఇజెడ్‌లో ఎస్ఎస్ఎన్‌సియు పరిశ్రమలో ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి జారిపడి మృతి చెందిన కక్కుల ఈశ్వరి కుటుంబానికి 20 లక్షల 50 వేల రూపాయలు పరిహారం చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు బుధవారం రాత్రి పరిశ్రమ ప్రతినిధులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, ఎంపీటీసీ సభ్యుడు ఎం నర్సింగరావు తదితరులు సమక్షంలో లిఖితపూర్వకంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే యాజమాన్యంతో చర్చించగా వారు స్పందించకపోవడంతో పరిశ్రమ ఆవరణలో ఆమె మృత దేహంతో ఆందోళనకు దిగారు. బుధవారం రాత్రి పరిశ్రమ ఆవరణలోనే ఆమె బంధువులు సిఐటియు నాయకులు తదితరులు ఆందోళన కొనసాగించారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం దిగివచ్చి ఆందోళనకారులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రాము మాట్లాడుతూ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంలో యాజమాన్యాలు విఫలమవుతున్నాయని తెలిపారు. మృతి చెందిన కార్మికులకు పరిహారం ఇవ్వడానికి ఆలోచించే యాజమాన్యం ముందు జాగ్రత్తలు తీసుకుంటే అటువంటి పరిస్థితులు తలెత్తవి కావని పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ అధికారులు తరచూ సందర్శించి సౌకర్యాలపై చర్చించాలని కోరారు.

పేదల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వైసిపి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు అన్నారు. వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పించన్దారులపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రేమ అభిమానాలతో పింఛన్ నగదును మూడు వేల రూపాయలు పెంచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరిదేవి, నాగరాజు, సచివాలయం కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, రామారావు, కో-ఆపరేటివ్ అధ్యక్షులు బుదిరెడ్ల భూషణం, సర్పంచ్ గోవింద పాల్గొన్నారు.

ట్యాబుల ద్వారా ఉత్తమ బోధన

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ట్యాబుల ద్వారా విద్యార్థులు ఇంటికి వెళ్ళిన తరువాత పాఠాలు అభ్యసన చేయడానికి వీలవుతుందని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా చేయడానికి బోధన, అభ్యసనలను సరళీకరించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ట్యాబులను ఇస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరం జిల్లాలో 16,494 ట్యాబులు విద్యార్థులకు, 3,194 ఉపాధ్యాయులకు సరఫరా చేశారని, ఈ ఏడాది 8వ తరగతి విద్యార్థులకు 15,201 ట్యాబులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జె.ప్రసన్నలక్ష్మి, ఎం.సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మాజీ, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి సుజాత, విద్యాశాఖ ఏడి రవిబాబు, ఎలమంచిలి డిప్యూటీ డిఇఓ అప్పారావు, ఎంఈఓలు చిట్టిబాబు, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో నర్సింగబిల్లి హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె.తుని సర్పంచ్ కోన అరుణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నస్థితికి ఎదగాలని, విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోన నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీడికాడ : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాశాఖ అధికారులు బుంజు బాబు, బివి రమణ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కురచ జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి శారద వరలక్ష్మి జానకిరామ్ చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. వైసిపి నాయకులు పరవాడ మహేష్, చైతన్య, పీల సుందరం, దాసు, సిమెంట్ నాయుడు, గడ్డం నాయుడు పైడితల్లి పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగుల ఆర్.సి.యం ఉన్నత పాఠశాలలో ట్యాబ్ పంపిణీలో ఎంపీపీ రామధర్మజ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవుడమ్మ, ఎంపీపీ 2 సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు బొమ్మిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యస్.రాయవరం : కొరుప్రోలు క్యాంప్ ఆఫీసులో శాసన సభ్యులు గొల్ల బాబురావు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు గురువారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపిడీవో శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ సుందరరావు ఎంఈఓ కె.నరేష్, వేమగిరి నూకరాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిందని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. దక్షిణ నియోజకవర్గం రైల్వే న్యూ కాలనీ పరిధిలోని కెఎన్‌ఎం (కమలా నెహ్రూ) బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక పరిజానాన్ని అందిపుచ్చుకునేందుకు, ఆధునిక విషయాలను తెలుసుకునేందుకు ట్యాబ్‌లు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎనిమిదో తరగతి చదువుతున్న 10,562 మందికి ట్యాబ్‌లు వచ్చాయని, వాటిని ఈ నెలాఖరు నాటికి అందరికీ అందజేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు మధురానగర్ జివిఎంసి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులకు స్థాఇనక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె. రాజు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకర్ రావు, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కెవి.బాబా, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల గణేష్, హెచ్‌ఎం శాంతికుమారి, యం.సునీల్, గాలి ప్రసాద్, పరదేశీరెడ్డి, శంభు పద్మ, సన్నీ పాల్గొన్నారు



చీడికాడలో ట్యాబులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉత్సాహంగా చెకుముకి సైన్స్ సంబరాలు



నర్సీపట్నంలో ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-నక్కపల్లి:విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడంతో శాస్త్రీయ దృక్పథం పెంపొందు తుందని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బర్నికాన రాము అన్నారు. మండలంలోని చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మండల స్థాయి పరీక్ష నిర్వహించారు. పాఠశాల స్థాయిలో 10 టీములు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ప్రజల్లో మూఢనమ్మకాలను పారద్రోలేందుకు జన విజ్ఞాన వేదిక 30 ఏళ్ల నుండి జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు లోడా అప్పలరాజు, మండల నాయకులు భర్నికుల శివ, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు మనబాల రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

యస్.రాయవరం:మండలంలో అడ్డరోడ్డులోని విశ్వశాంతి హైస్కూల్‌లో చెకుముకి సంబరాలు నిర్వహించారు. విశ్వశాంతి స్కూల్ కరెస్పాండెంట్ జి. శ్రీనివాసరావు, కొలగాని వరప్రసాద్ పాల్గొన్నారు. మొదటి స్థానం ఎస్ రాయవరం బాయ్స్ హై స్కూల్, రెండవ స్థానం కొరుప్రోలు హై స్కూల్ దక్కించుకున్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో మొదటి రెండవ స్థానాలు రాయవరం వినయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బ్యాచ్ -1, బ్యాచ్-2 దక్కించుకున్నట్టు అయన తెలిపారు. జిల్లా స్థాయి సంబరాలు జనవరి 7న పెద్ద గుమ్ములురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తామని తెలిపారు.



నక్కపల్లిలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నలంద ఇంగ్లీషు మీడియం స్కూల్, వేములపూడి విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహించారు. ఈ పోటీల్లో నర్సీపట్నం అమరావతి స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. గ్రామీణ ప్రాంతానికి సంబంధించి ప్రభుత్వ మోడల్ స్కూలు విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేములపూడి విద్యార్థులు విజేతలుగా నిలిచారు.చెకుముకి సంబరాలను వేములపూడిలో స్థానిక హైస్కూల్ బయాలజీ అసిస్టెంట్ కళ్యాణి, నర్సీపట్నంలో జె. వివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు నిర్వహించారు.

అచ్యుతాపురం:అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని 17 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పాఠశాల స్థాయిలో గెలుపొందిన వారు మండల స్థాయి పోటీలకు హాజరయ్యారు. ఈ పరీక్ష పేపర్లను పాఠశాల హెచ్ఎం ఎం.పద్మావతి చేతుల మీదుగా విడుదల చేశారు. మండల స్థాయిలో ప్రైవేట్ పాఠశాల నుంచి శ్రీభవాని విద్యానికేతను చెందిన యు.లాస్య, జి సహస్ర, ఎల్ గ్రీష్మ, ప్రభుత్వ పాఠశాల నుంచి అచ్యుతాపురం ఎపి రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థునులు ఎ.త్రివేణి, ఎల్.మేఘన, కె.మౌనిక విజేతలుగా నిలిచారు. వీరికి జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు మారిశెట్టి వెంకట అప్పారావు, ఆషాల ఏకైక పుత్రిక మారిశెట్టి మోక్షితమాన్వి పేరున బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి బొడ్డేడ రామ్‌కుమార్, ఉపాధ్యాయులు నానాజీ, వెంకటేశ్వరరావు, జిఎస్ ప్రకాష్, ధోని, నూకరాజు, కుందల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు .



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గత నెలలో సత్య సాయి బాబా సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలస్థాయిలో విద్యార్థులకు ఆచార్య దేవోభవ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పెదబోదుగల్లం హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని షేక్ తాజున్నీషాబేగం ప్రథమస్థానం కైవశం చేసుకుంది.ద్వితీయ స్థానంలో ఎమ్.డి.రఫీ, తృతీయ స్థానంలో సిరాజ్ నిషా బేగం నిలిచారు. నక్కపల్లి సత్యసాయి బాబా భజనమండలి నిర్వాహకులు ఎన్.విశ్వేశ్వరరావు, కొత్త భగవాన్, సహాయ ప్రధానోపాధ్యాయురాలు ఎ.వి.ఎల్.ఎన్.కుమారి చేతుల మీదుగా విజేతలకు గురువారం ప్రశంసాపత్రములు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, రమేష్ బాబు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ సిఇఒ

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల పరిషత్ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ గురువారం ఆకస్మిక సందర్శించి పలు రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిధులు సక్రమంగా వినియోగించాలని, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయాల సందర్శన తరచూ నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, పిఆర్ ఇంజనీర్ వర్మ పాల్గొన్నారు.



వైఎస్ఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

పేదలకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో గురువారం రామచంద్రపాలెం గ్రామంలో జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఎంపీపీ దత్తుడు రాజు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో రెండోసారి వైసీపీ ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు సచివాలయంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరదేశమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, తమరాన కన్నబాబు, లాలం మహేష్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:మండలం కేంద్రంలో సచివాలయం 1 లో మళ్లీ జగనన్న సీఎం ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించినట్టు వైస్ ఎంపీపీ బోలిశెట్టి గోవిందరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ని సచివాలయంలో1 నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా బొలిశెట్టి గోవిందరావు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ సంక్షేమ పతకాలపై ప్రజలకు వాలంటీర్స్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇ ఓ ఆర్‌డి సత్యనారాయణ, ఎంపీటీసీ బైపాస్ శ్రీను, కొలతల శ్రీను, సెక్రెటరీ సత్యనారాయణ, చిన్ని, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా మెలగాలి

ప్రజాశక్తి -కొత్తకోట:చెడు నడత కలిగిన వ్యక్తుల పట్ల బాలికలు అప్రమత్తంగా మెలగాలని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణ రావు తెలిపారు. గురువారం రావికమతం మండలంలో కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థునులకు సెల్ ఫోన్ వాడకంపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ వాడకంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

గిరిజన సమస్యలపై ప్రస్తావన ఏదీ?

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:చింతపల్లి పర్యటనలో జగన్ బై జ్యూస్ టాబ్ కంపెనీ ప్రచారానికి వచ్చినట్లు తప్ప ఆదివాసీ గిరిజనులు సమస్యలు ప్రస్తావించక పోవడం పట్ల ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర విమర్శించారు. గురువారం అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులను అరెస్టులు, గృహ నిర్బంధాలపై పెట్టిన శ్రద్ధ ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎందుకు లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చింతపల్లి పర్యటనలో సమస్యలు ప్రస్తావన లేకుండా కేవలం బై జ్యూస్ టాబ్ కంపెనీకి ప్రచారానికి వచ్చినట్లు ఉందని విమర్శించారు.ముఖ్యమంత్రికి గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొటున్న సమస్యలు కనిపించ లేదని మండి పడ్డారు.సిఎం పర్యటన సదర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ నాయకుడు పి. అప్పలనర్స, జిల్లా ప్రధాన కార్యదర్శి పిబాలదేవ్, సీఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చిన్నయ్య పడాల్, అనంతగిరి జడ్పీటిసి డి.గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎల్ సుందర్ రావు, సన్నిబాబు, కె.సూరిబాబు, చిరంజీవిలను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచడానికి ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. గృహా నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరన్నారు. ప్రధాన మైన గిరిజన సమస్యలు జిఓ 3కు చట్టబద్ధత కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, గిరిజన స్పెషల్ డీఎస్సీ, హైడ్రోపార్ ప్రాజెక్ట్ వంటి సమస్యలపై నోరు ఎత్తకపోవడంతో గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు షెడ్యూల్ ఏరియాలో కలపాలని, 60 కోట్ల కాఫీ రైతుల బకాయిలు వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్య పై ఎందుకు నోరు విప్పలేదని అన్నారు. తుపాన్ కారణంగా నష్టపోయినా రైతులకు అంచనా వేచి నేటి వరకు పరిహారం అందించలేదన్నారు.మాగీ భాష విద్య వలంటీర్ల కనీస వేతనాలు 36 వేలు ఇవ్వాలని డిమాండ్ డిమాండ్ చేశారు.పాడేరు ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం బై జ్యూస్ ట్యాబ్ కోసం ప్రచారర్భాటం చేస్తోందన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో నూతన విద్యా విధానం పేరుతో 107 పాఠశాలలు మూసేసారన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కుర్ర మగ్గన్న, బురిడీ థశరద్, పాల్గొన్నారు.



గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - గొలుగొండ:కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ డేవిడ్ రాజు కోరారు. లింగంపేట గ్రామంలో వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ పురం పిహెచ్‌సి వైద్యాధికారి ప్రవీణ్, హౌసింగ్ ఏఈ మధుసూదన్‌రావు, వెలుగు ఏపీఎం మంగ, పంచాయతీ కార్యదర్శి సాధనాలు అప్పారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని జైతవరం గ్రామంలో వికసిత కార్యక్రమంలో భాగంగా గురువారం సర్పంచ్ కోడూరు సత్యవతి ఆధ్వర్యంలో కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాశ్రావు, ఈవోపి ఆర్‌డి కామేశ్వరరావు పాల్గొన్నారు.విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, సచివాలయ సిబ్బంది. వాలంటీర్లు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికులు సమ్మె నోటీస్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈ నెల 26 నుండి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేపట్టనున్నారు. దీనిలో భాగంగా గురువారం ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పని చేస్తున్న సుమారు 50వేల మంది కాంట్రాక్టు కార్మికులకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని పలు మార్లు విన్నవించడం జరిగిందన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గ్రాట్యుటీ, సంక్షేమ పథకాలు, సర్వీస్‌లో ఉండి మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల ప్రెసిడెంట్ బొర్రా శ్రీనివాసరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న టిడ్కో ఛైర్మన్

టిడ్కో గృహాల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం పురపాలక సంఘ పరిధిలో టిడ్కో గృహ సముదాయములను గురువారం ఏపీ టిడ్కో ఛైర్మన్ జె.ప్రసన్నకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, నర్సీపట్నం శాసన సభ్యులు పి.ఉమాశంకర్ గణేష్ అభ్యర్థన మేరకు పనులు పరిశీలన చేశామన్నారు. 2024 జనవరి లోపు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. నర్సీపట్నం మున్సిపల్ కమీషనర్ రవి బాబు, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:సమస్యలను పరిష్కరించాలని తహసిల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకులు గురువారం నిరసన చేపట్టారు. కనీస వేతనం చెల్లించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు కోరారు.

బిఎస్ఎన్ఎల్ సేవలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని తాడేపూట్టు పంచాయతీలో పరిధిలోని గ్రామాలకు బిఎస్ఎన్ఎల్ నెట్ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని టిడిపి యూనిట్ ఇన్చార్జి సోమేలి లక్ష్మయ్య కోరారు. గురువారం ఆయన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు తుఫాన్ ప్రభావం నుండి నేటి వరకు సుమారు పది రోజులవుతున్నా నెట్ వర్క్ పని చేయలేదన్నారు. అధికారులు స్పందించి సేవలను పూర్తిస్థాయిలో అందించాలని ఆయన కోరారు.

అంగన్వాడీల ర్యాలీలు, మానవహారాలు



ఎస్.రాయవరంలో దీక్షా శిబిరంలో కూర్చున్న లోకనాథం

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు గురువారం సమ్మెను కొనసాగించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో ర్యాలీ, మానవహారాలు చేపట్టారు. పిఎం పాలెంలో కోలాటం ఆడారు.

యస్. రాయవరం:తహశీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, యూనియన్ నాయకులు లక్ష్మీ, సీతారత్నం, వరలక్ష్మీ, జోగలక్ష్మి పాల్గొన్నారు.

పాయకరావుపేట:స్థానిక పాండురంగ స్వామి దేవాలయం మెయిన్ రోడ్డుపై మానవహారం చేపట్టారు.అంగన్వాడీ కేంద్రాల తలుపులు పగులకొట్టే చర్యలు మానుకోవాలని నినాదాలు చేశారు. ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు నూకరత్నం, సత్యవేణి, జ్యోతి, ఫణి తదితరులు పాల్గొన్నారు

రావికమతం:మండల కేంద్రంలో అంగన్వాడీల చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి మాట్లాడుతూ, అధికారులతో అంగన్వాడీ కేంద్రాలను ఎన్నాళ్లు కొనసాగిస్తారో అది తాము చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

నక్కపల్లి:స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం అంగన్వాడి వర్కర్స్ మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారాణి, యూనియన్ నాయకులు బి.సుబ్బలక్ష్మి, రమణమ్మ, సీత, నూకరత్నం, సత్య వేణి, కవిత, లక్ష్మి రాజ్యం, లక్ష్మీ పాల్గొన్నారు.

కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు నిరసన చేపట్టారు. సిపిఎం నాయకులు దేవిడ్‌రాజు, అంగన్వాడీల సంఘం అధ్యక్షురాలు పుష్ప పాల్గొన్నారు.

చీడికాడ:మండల కేంద్రంలో చవిడి సెంటర్లో సిఐటియు నేత దేముడునాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు బి.జానకి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలు మానవహారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఐసిడిఎస్ యూనియన్ నాయకురాలు జానకి, మండల కోశాధికారి ఉమ, కార్యకర్తలు అమ్మాజీ, భారతమ్మ, పైడితల్లమ్మ తదితరులు పాల్గొన్నారు .

కశింకోట : అనకాపల్లి ప్రాజెక్టు పరిధిలోని కశింకోట, అనకాపల్లి మండలాల అంగన్వాడీలు కసింకోట మండలంలో జాతీయ రహదారి పక్కన చేపట్టిన దీక్షలు పదో రోజు కొనసాగాయి. జాతీయ రహదారి వద్ద మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి, యూనియన్ నాయకురాలు కాసులమ్మ, తనుజ, ఆదిలక్ష్మి, రామలక్ష్మి, చిన్నారి, కుమారి, సంతోషి, జగదీశ్వరి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అంగన్వాడీ కార్యకర్తలు అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహించి, జంక్షన్లో మానవహారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, నాయకులు కె సోమునాయుడు, యూనియన్ నాయకులు బి జయ, ఎన్ వరలక్ష్మి, పి నారాయణమ్మ, ఆర్ సత్యవతి, లక్ష్మి రత్నం, రమణమ్మ, అరుణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు ఆందోళన కొనసాగించారు. తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి పాపులు భిక్షాటన, నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, సిఐటియు మండల కార్యదర్శి బిటి దొర, యూనియన్ నాయకులు జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, అమ్మాజీ, కోమలి పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మునగపాకలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనకు మండల వీఆర్ఏల సంఘ నాయకులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. అంగన్వాడీలు శిబిరం నుండి ర్యాలీగా బయలుదేరి మెయిన్ రోడ్‌లో మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, అంగన్వాడీ టీచర్లు హేమలత, రామలక్ష్మి, తులసి లక్ష్మి జయలక్ష్మి, శివ గణేష్మమ్మ, భవాని, ఉమా, సరస్వతి, నాగమణి, లక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.



పిఎం పాలెంలో కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీలు

బుచ్చయ్యపేట : అంగన్వాడీలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నుండి రాలిగా నాలుగు రోడ్ల కూడలి వరకు వెళ్లి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల సమావేశానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అంగన్వాడీల శిబిరం వద్దకు వచ్చి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

యలమంచిలి : మండలంలోని ఐసిడిఎస్ లైన్‌కొత్తూరు కార్యాలయం వద్ద అంగన్వాడీలు మానవ హారంగా ఏర్పడి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, అంగన్వాడీ యూనియన్ నాయకులు శశికళ, రత్నం, జయలక్ష్మి, ఎల్.రమణమ్ములు పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంగన్వాడీల ఆందోళన మండల కేంద్రంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు. సిఐటియు నాయకులు గాడి ప్రసాదు, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు డోకల కుమారి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక మండల కార్యాలయం వద్ద అంగన్వాడీలు రిలే దీక్షలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం కొత్తూరు జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. వీరికి అంగన్వాడీలకు జన భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి వరలక్ష్మి సంఘీభావం తెలిపారు.

సబ్బవరం : స్థానిక తహసిల్దార్ కార్యాలయం దీక్షా శిబిరం నుండి అంగన్వాడీలు ర్యాలీగా ఎన్టీఆర్ జంక్షన్ వరకు వెళ్లి అక్కడ మానవహారం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకులు పుష్ప, జగదీశ్వరి, ఎం వరలక్ష్మి, ఎస్ రమణమ్మ, నాగమణి , సుభాషిని, శివరామలక్ష్మి, పరదేశమ్మ పాల్గొన్నారు.

కేంద్రాల తెరవడాన్ని అడ్డుకున్న టిడిపి, జనసేన నాయకులు

సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ శివారు గణపతి నగర్‌లో అంగన్వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ సిబ్బంది తెరిచేందుకు వస్తే టీడీపీ, జనసేన నేతలు గురువారం అడ్డుకున్నారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించిన పిమ్మట కేంద్రాలు తెరవాలని స్పష్టం చేశారు.



బుచ్చయ్యపేటలో మానవహారం



నక్కపల్లిలో చిన్నారి నిరసన

పైడివాడ అగ్రహారం సచివాలయ మహిళా కానిస్టేబుల్ అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు ప్రయత్నిస్తే గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేసుపూడి రమణ, కర్రి శ్రీనివాసరావు, మామిడి కనక రాజు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అనకాపల్లి

అంగన్వాడీలు ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8 నుంచి వచ్చిన చేపట్టిన నిరవధిక సమ్మెకు ప్రజా సంఘాల మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనములో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పిళ్లి మాణిక్యం, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు బూసి పరమేశ్వరి, విశాఖ మహిళా వేదిక లాయర్ కుసుమ, కౌలు రైతు సంఘం నాయకులు తెలయ్య బాబు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి బుగిడి నూక అప్పారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, ప్రజా సంఘాలు అంగన్వాడీ వర్కర్లు కార్యకర్తలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మద్దతు తెలిపారు. రేపటి నుంచి మున్సిపల్ వర్కర్స్ కూడా సమ్మెలో ఉంటున్నారని, మున్సిపల్ వర్కర్స్ ఉద్యోగాలు కూడా సచివాలయం అధికారులు చేస్తారా అని ఐద్వా ప్రశ్నించింది. సమ్మె జరుపుకునే హక్కు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కి ఉందని, ఇందులో సచివాలయం అధికారులు జోక్యం చేసుకోవద్దని సూచించింది. సచివాలయం అధికారుల తీరు మార్చుకోవాలని, ఏ కార్మికుడు సమ్మె చేస్తే ఆ కార్మికులు ఉద్యోగాలు చేయడానికి సచివాలయాలు ఉన్నాయా అని, ఇది ఎంతవరకు న్యాయం అన్నారు.ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, రామలక్ష్మి, శాంతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోలాటం, ఆటపాటలతో నిరసన

పిఎం పాలెం: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి డిమాండ్ చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద పదిరోజులుగా సమ్మెచేస్తున్న అంగన్వాడీ దీక్షా శిబిరాన్ని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు పడాల రమణ, సిఐటియు రాష్ట్ర నాయకులు కెఎం.శ్రీనివాస్, పి మణి, జిల్లా నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, పి రాజ్‌కుమార్ పాల్గొని సంఘీభావం సందర్శించి సంఘీభావం తెలిపారు. కోలాటం, ఆటపాటలతో నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్వి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఆందోళనలో అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్ తులసి, ఐదవ జోన్ అధ్యక్షురాలు కె.సుజాత, సిఐటియు జిల్లా నాయకులు కే.పద్మావతి, కె.వెంకటలక్ష్మి, కె.కోమలి, కె.లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఆర్ శ్రీదేవి,రమణమ్మ పాల్గొన్నారు.

అంగన్వాడీల వంటావార్పు

పెందుర్తి : సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు పదిరోజులుగా చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం వంటావార్పు నిరసన చేపట్టారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.బృందావతి, ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, నాయకులు బి.భవానీ, ఆర్ అనిత, సరస్వతి, కళ, చిన్నమ్ములు, సోమేశ్వరి, వేణు, జ్యోతి, గంగ పాల్గొన్నారు.

10 అంకె మాదిరి అంగన్వాడీల మానవహారం

విశాఖ కలెక్టరేట్ : అంగన్వాడీల రాష్ట్ర వ్యాప్త సమ్మె 10వ రోజుకు చేరుకుంది. దీనిని గుర్తు చేస్తూ, గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్వాడీలు 10 అంకె మాదిరి మానవహారంగా ఏర్పడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు వై.తులసి మాట్లాడారు. కార్యక్రమంలో పి.శ్యామలాదేవి, గుడివాడ అరుణ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు జి.అప్పలరాజు, ఎఐటియుసి నాయకుడు పడాల రమణ శిబిరాన్ని సందర్శించారు.